
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
గురువారం | 19 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 12

ఆలయ పునర్నిర్మాణం, పుష్కర ఘాట్ల
పనులు గడువులోగా పూర్తి చేయాలి

- అధికారులకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్ర సాద్ ఆదేశం
- ధర్మపురిలో ఆలయం, ఘాట్ల నిర్మాణ పనుల పరిశీలన



జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ధర్మపురి పట్టణంలో చేపడుతున్న ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం, పుష్కర ఘాట్ల పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

మిగతా 2 లో...



ఇందిరమ్మ పాలనలో...
పేదలకు సంక్షేమ భరోసా

- కోనరావుపేట మండలంలో 608 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, నవంబర్. 18 (ప్రజాజ్యోతి) పేదల సంక్షేమం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధ వారం కోనరావుపేట మండల కేంద్రంలో 608 మంది లబ్ధిదారు లకు చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను, 77 మంది లబ్ధిదారులకు 26 లక్షల 25 వేల మంది లబ్ధిదారు లకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మంజూరు పత్రలను అందజేశారు.. వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికా రంలోకివచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. మనిషికి రెండు కళ్లల అభి వృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గ్రామంలో, ప్రతి గడపకు తీసుకె ళ్లాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో అర్హులైన పేద లకు కొత్తగా 8,052 పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు ఆది శ్రీనివాస్ వెల్లడించారు. కొనరావుపేట మండల నికి మరో 608 మందికి కొత్తగా పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు, దివ్యాంగులు

మిగతా 2 లో...

సన్న వడ్ల సాగుకు
ప్రోత్సాహం ఏది..?

- కొనుగోలు కేంద్రాలు లేక అన్నదాత ఆగమాగం!
- ప్రచారంతో సరిపెట్టిన వ్యవసాయ శాఖ..
- క్షేత్రస్థాయిలో కానరాని కొనుగోలు కేంద్రాలు
- దొడ్డు రకాల విత్తనాలపై ఆంక్షలు పెట్టి, సన్నాలు సాగు చేయించిన అధికారులు

ఒవైపు 'ఎల్ నినో', మరోవైపు చీడపీడలతో సగానికి పడి పోయిన దిగుబడులు

ప్రభుత్వ కొనుగోళ్లు లేక దళారులకు క్వింటాల్ రూ. 2,300 – రూ. 2,600 కే విక్రయిస్తున్న దుస్థితి



జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి) : సన్న రకం వరి సాగును ప్రోత్సహిస్తామని, రైతు లకు లాభసాటి ధర కల్పిస్తామని సీజన్ ప్రారంభంలో ఊదరగొట్టిన వ్యవసాయ శాఖ, తీరా పంట చేతి కొచ్చే సమయానికి చేతులెత్తేయ డంపై సర్వత్రా విమర్శలు వెల్లువె త్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఎక్కడా కానరాకపోవడంతో, ఆరు గాలం కష్టపడి పండించిన సన్న వడ్లను అమ్ముకోలేక అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో దళా రులు అడిగిన ధరకే

మిగతా 2 లో...

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- పండుగ వాతావరణంలో ప్రారంభోత్సవాలు నిర్వహించాలి
- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీ ఎస్ సమీక్ష
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నవంబర్ – 18 (ప్రజాజ్యోతి) రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా అమలు చేయనున్న ఇంది రమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించే సమయం లోనే అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఒకే సారి మొదలు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదే శించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, దరఖాస్తుల సేకరణ, ప్రజ లకు అవగాహన కల్పించడం, తదితర అంశాలపై అన్ని

మిగతా 2 లో...

పెద్దపల్లిలో ఏసీబీ వలలో పబ్లిక్ ప్రాసిక్యూటర్

- కేసులో అనుకూలంగా వ్యవహరించేందుకు రూ.1.50 లక్షల లంచం డిమాండ్.. ప్రైవేట్ వ్యక్తి ద్వారా స్వీకరణ
- రూ.2 లక్షల నుంచి రూ.1.50 లక్షలకు తగ్గించిన డిమాండ్.. ఇద్దరినీ అరెస్ట్ చేసిన ఏసీబీ



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 18, ప్రజాజ్యోతి: పెద్దపల్లి జిల్లా ప్రధాన జిల్లా, సెషన్స్ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న డొంకెన రవీందర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. కోర్టులో విచారణలో ఉన్న ఓ క్రిమినల్ కేసులో నిందితుడికి అనుకూలంగా వ్యవహరించేందుకు ప్రైవేట్ వ్యక్తి రెడ్డిరాజుల రాజయ్య ద్వారా ఫిర్యాదు దారుడి నుంచి రూ.1.50 లక్షలు లంచంగా స్వీకరిస్తుండగా ఏసీబీ కరీం నగర్ యూనిట్ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ విడు దల చేసిన ప్రకటన ప్రకారం.. ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 12/2023 కేసు కోర్టులో విచారణలో ఉంది. ఈ కేసును నిర్దోషిగా ముగించేందుకు

మిగతా 2 లో...

ఇందిరమ్మ పాలనలో పేదలకు సంక్షేమ భరోసా



(మొదటి పేజీ తరువాయి...)

తదితర అర్హులైన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

పేద కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా

పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నారని తెలిపారు. ఈ నెల 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సిద్దిపేటలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రేషన్ కార్డు కలిగిన అర్హులైన పేద కుటుంబాలకు కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో రూ.5 లక్షల జీవిత బీమా అందించాలన్నది ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. గతంలో రైతులకు మాత్రమే పరిమితమైన బీమా భరోసాను భూమిలేని నిరుపేద కుటుంబాలకు సైతం విస్తరించాలనే గొప్ప ఆలోచనతో ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి కుటుంబ పెద్దల వివరాలు సేకరించి అర్హుల పేర్లను నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వరలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు కేతిరెడ్డి జగన్ మోహన్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొమ్మెన భాస్కర్ రావు, మండల అధ్యక్షులు మానుక సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఫిరోజ్ పాషా, ఎఎంసి వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, సింగిల్ విండో డైరెక్టర్లు, సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో ఏసీబీ వలలో పబ్లిక్ ప్రాసిక్యూటర్

(మొదటి పేజీ తరువాయి...)

నిందితుడికి అనుకూలంగా సాక్షుల విచారణ జరిగేలా సహకరించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్ తొలుత రూ.2 లక్షలు డిమాండ్ చేశారు. ఫిర్యాదుదారుడి అభ్యర్థన మేరకు ఆ మొత్తాన్ని రూ.1.50 లక్షలకు తగ్గించారు. అనంతరం ప్రైవేట్ వ్యక్తి రెడ్డిరాజుల రాజయ్య ద్వారా లంచం స్వీకరించేందుకు అంగీకరించారు. ఈ క్రమంలో నవంబర్ 18న పెద్దపల్లి పట్టణంలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్ నివాసంలో ఏసీబీ అధికారులు దాడి చేసి ఇద్దరినీ పట్టుకున్నారు. రెడ్డిరాజుల రాజయ్య ధరించిన ప్యాంటు ఎడమ జేబులో నుంచి రూ.1.50 లక్షల లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. రసాయన పరీక్షల్లో ఆయన రెండు చేతుల వేళ్లు పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు ఏసీబీ వెల్లడించింది. ఈ కేసులో ఏ1–1గా పేర్కొన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్, ఏ–2గా పేర్కొన్న ప్రైవేట్ వ్యక్తి రెడ్డిరాజుల రాజయ్యలను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. కరీంనగర్‌లోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని, భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచినట్లు పేర్కొన్నారు.

లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

ఆలయ పునర్నిర్మాణం, పుష్కర ఘాట్ల పనులు గడువులోగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ధర్మపురిలో క్షేత్రస్థాయి పర్యటన జరిపి పనుల పురోగతిని పరిశీలించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని న్యూ ఘాట్స్, హెలిప్యాడ్ లు, మహాలక్ష్మి ఘాట్ నుంచి వీఐపీ ఘాట్ వరకు నిర్మిస్తున్న రహదారుల పనులను వేగవంతం చేయాలని సూచించారు. పుష్కరాలకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పి.మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభించాలి

(మొదటి పేజీ తరువాయి...)

జిల్లాల కలెక్టర్లతో రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 19వతేదీన సిద్దిపేట జిల్లా నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారని తెలిపారు. అదే సమయంలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో కూడా పథకాన్ని ఒకేసారి ప్రారంభించాలని స్పష్టం చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ, అవసరమైన



అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలి

ప్రతి కుటుంబానికి బీమా భద్రత కల్పించనున్న నేపథ్యంలో ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు సేకరించాలని సూచించారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, దరఖాస్తుల సేకరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన దరఖాస్తు ఫారాన్ని సేకరించాలని, అందులో బీమా పొందే వ్యక్తి వివరాలు, నామినీ వివరాలు స్పష్టంగా నమోదు చేయించాలని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తు అందేలా గ్రామ, వార్డు స్థాయిలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, దరఖాస్తుల సేకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఉద్దేశం, ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, తదితర అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో మైక్ ప్రచారం, పోస్టర్లు, కరపత్రాలు, ప్రజా సమావేశాలు, మీడియా ద్వారా పథకం వివరాలను ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, దరఖాస్తుల సేకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి వీర భద్రయ్య, జిల్లా ప్రణాళిక అధికారి సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, ఈడీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సన్న వడ్ల సాగుకు ప్రోత్సాహం ఏది?..

(మొదటి పేజీ తరువాయి...)

తెగనమ్ముకుంటూ నిలువునా మునిగిపోతున్నారు.

విత్తనాలపై ఆంక్షలు పెట్టి.. ఇప్పుడిలా వదిలేశారు:

ఈ సీజన్‌లో దొడ్డు రకం వరి సాగును తగ్గించి, సన్న రకాలను మాత్రమే సాగు చేయాలని ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు అన్నిరకాలుగా ప్రయత్నాలు చేశారు. సబ్సిడీ విత్తనాల పంపిణీలోనూ దొడ్డు రకాలపై ఆంక్షలు విధించి, సన్న వడ్ల వైపు రైతులను మళ్లించారు. ప్రభుత్వ మాటలు నమ్మి, మద్దతు ధరతో పాటు అదనపు ప్రోత్సాహం లభిస్తుందన్న ఆశతో వేలాది ఎకరాల్లో రైతులు సన్న రకాలను సాగు చేశారు. అయితే, ఇప్పుడు పంట కోతలు పూర్తయి ధాన్యం కల్లాల్లోకి వచ్చినా, కొనుగోలు కేంద్రాల ఊసే లేకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. కేవలం ప్రచారం చేసి వ్యవసాయ శాఖ చేతులు దులుపుకుందని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ప్రకృతి కన్నెర్ర.. చీడపీడల దెబ్బ.

ఈ ఏడాది సన్న వడ్లు సాగు చేసిన రైతులకు మొదటి నుంచీ కష్టాలే ఎదురయ్యాయి. ఓవైపు 'ఎల్ నినో' ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి సాగునీటికి ఇబ్బందులు పడ్డారు. మరోవైపు వాతావరణ మార్పుల వల్ల సన్న రకాలకు చీడపీడల ఉధృతి ఎక్కువైంది. తెగుళ్ల నివారణకు వేలాది రూపాయలు వెచ్చించి పురుగుమందులు పిచికారీ చేసినా, ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. ఎకరాకు పది బస్తాలు కూడా తూగని పరిస్థితుల్లో, కనీసం పెట్టిన పెట్టుబడి అయినా వస్తుందో రాదోనని రైతులు దిగులు చెందుతున్నారు.

దళారుల దోపిడీకి బలయిన రైతన్న..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడం వ్యాపారులు, దళారులకు వరంగా మారింది. తేమ శాతం సాకుతో, నాణ్యత లేదంటూ రకరకాల కొర్రీలు పెడుతూ దళారులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో సన్న వడ్లను క్వింటాల్‌కు కేవలం రూ. 2,300 నుండి రూ. 2,600 మధ్య మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. కూలీల ఖర్చులు, ఎరువులు, పురుగుమందుల పెట్టుబడితో పోలిస్తే ఈ ధర ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు. అప్పులు చేసి సాగు చేసిన తాము, ఇప్పుడు దళారుల చేతిలో మోసపోతూ ఆత్మహత్యలకు పాల్పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రతి గ్రామంలో సన్న వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. సాగుకు ముందు ఇచ్చిన హామీ మేరకు సన్న రకాలకు ప్రత్యేక బోనస్‌తో కూడిన మద్దతు ధరను ప్రకటించాలి. దళారుల దోపిడీని అరికట్టడానికి రెవెన్యూ, మార్కెటింగ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలి.

విద్యార్థులకు సీపీఆర్‌పై మెగా శిక్షణ

- అత్యవసర వేళల్లో ప్రాణాలు కాపాడే నైపుణ్యాలను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష
- నవంబర్ 21న సింగరేణి వైద్య కళాశాలలో వెయ్యి మందికి పైగా విద్యార్థులతో అవగాహన కార్యక్రమం



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 18, ప్రజాజ్యోతి: గుండె సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో స్పందించి ప్రాణాలను కాపాడే సీపీఆర్ (కార్డియోపల్మోనరీ రిససిటేషన్) విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. ఆపద సమయంలో వైద్య సహాయం అందేలోపు సరైన పద్ధతిలో సీపీఆర్ అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్) కళాశాల మైదానంలో నిర్వహించనున్న మెగా సీపీఆర్ అవగాహన, శిక్షణ కార్యక్రమానికి సంబంధించి కళాశాల విద్యార్థులు వాసు, సాహితి, అశ్విత్, హర్షవర్ధన్, సందీప్ తమ అధ్యాపకులు అరుణ, రాజుతో కలిసి కలెక్టర్‌ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, వైద్య కళాశాలలకు చెందిన వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొననున్నారు. అత్యవసర సమయాల్లో సీపీఆర్ అందించే విధానం, ప్రాణరక్షణ నైపుణ్యాలపై విద్యార్థులకు ప్రత్యక్ష శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్థిదశ నుంచే ఇలాంటి ప్రాణరక్షణ నైపుణ్యాలను నేర్చుకోవడం వల్ల వ్యక్తిగతంగా, సామాజికంగా ఎంతో ప్రయోజనం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. గుండె సంబంధిత అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు భయపడకుండా తక్షణమే స్పందించే సామర్థ్యం పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జిల్లాలోని విద్యాసంస్థల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, తాము నేర్చుకున్న ప్రాణరక్షణ పద్ధతులను కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇతరులకు కూడా తెలియజేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిమ్స్ విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలి





- కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ ప్రగతి సాధ్యం
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొడిమ్యాల, నవంబరు 18 (ప్రజాజ్యోతి): రాష్ట్రమంతా మరోసారి కరీంనగర్ వైపు చూసేలా దీక్షా దివస్‌స్ఫూర్తి సభను విజయవంతం చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు.మండలంలోని నాచుపల్లి బృందావనం రిసార్ట్స్‌లో కొడిమ్యాల,మల్యాల మండలాల బీఆర్ఎస్ముఖ్యకార్యకర్తలసన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2009 నవంబరు 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి కీలక మలుపుగా నిలిచిందన్నారు.కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలతో అభివృద్ధి కుంటుపడుతోందని విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు.బీఆర్ఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ..కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ ఉద్యమం కీలక దశకు చేరుకుందని, ఈ సభకు మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు బీజేపీ,కాంగ్రెస్ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరారు.

బీఆర్ఎస్‌కు షాక్.. కాంగ్రెస్‌లోకి కొడిమ్యాల పట్టణ అధ్యక్షుడు



కొడిమ్యాల, నవంబర్ 18 (ప్రజాజ్యోతి) : కొడిమ్యాల మండల బీఆర్ఎస్‌లో రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. ఆ పార్టీ కొడిమ్యాల పట్టణ అధ్యక్షుడు, దళిత సంఘాల సీనియర్ నాయకుడుకొత్తూరి స్వామి బుధవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.గత పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసినా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తనకు తగిన గుర్తింపు ఇవ్వలేదని ఆరోపించారు. కష్టపడే కార్యకర్తలను పట్టించుకోకపోవడంతోనే పార్టీని వీడినట్లు తెలిపారు.ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితుడై కాంగ్రెస్‌లో చేరినట్లు వెల్లడించారు.

కొడిమ్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొడిమ్యాల, నవంబరు 18 (ప్రజాజ్యోతి): మండల కేంద్రంలోని నవోదయ గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెర్ప్ (ఐకేపీ) వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సర్పంచ్ గడ్డం జీవన్‌రెడ్డి, తహసీల్దార్ నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. ఏడు రకాల సన్నధాన్యానికి మద్దతు ధరతో పాటు ప్రభుత్వం బోనస్ కూడా అందిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం మల్లేశం,వార్డు సభ్యులు నర్సింగరావు,రాధ,సీసీలు వీరకుమార్,స్వరూప,ఏఈఓ తేజస్విని,వీఓఏలు నర్మద,జ్యోతి,అన్నపూర్ణ, రాణి,గ్రామ సంఘాల అధ్యక్షులు,తదితరులు పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి కథనానికి స్పందన.. పూడ్చిన బోర్ వెల్ గుంత



మల్లాపూర్, నవంబర్ 18, ప్రజాజ్యోతి మండలంలోని కుస్తాపూర్ ప్రాథమిక పాఠశాల వద్ద అసంపూర్తిగా వదిలేసిన బోర్ వెల్ రీఛార్జ్ గుంతతో విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదాన్ని వివరిస్తూ నవంబర్ 17న 'ప్రజాజ్యోతి' పత్రికలో "చిన్నారుల ప్రాణాలకు ముప్పు.." అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారుల నుంచి తక్షణ స్పందన లభించింది. పత్రిక లో వచ్చిన వార్త ను తీవ్రంగా పరిగణించిన సంబంధిత అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. బుధవారం ఆ ప్రమాదకరమైన గుంత చుట్టూ కంకర రాళ్లను వేసి, దానిని పూర్తిగా నింపి భద్రతా చర్యలు చేపట్టారు.వారం రోజులుగా పనులు పూర్తికాక, ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడంతో నిత్యం ప్రాణభయంతో బడి కి వెళ్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధికారుల తాజా చర్యతో ఊపిరి పీల్చుకున్నారు. సకాలంలో సమస్యను వెలుగులోకి తెచ్చి, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'ప్రజాజ్యోతి' పత్రికకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



జగిత్యాల మార్కెట్ యార్డు చల్ గల్‌కు తరలింపు

జగిత్యాల టౌన్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో వానాకాలం ధాన్యం దిగుమతులు విపరీతంగా పెరగడం, స్థలం సరిపోకపోవడంతో మార్కెట్ యార్డును చెలగల్ మార్కెట్‌కు తరలించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.జగిత్యాల మార్కెట్ స్థలంలో రద్దీని దృష్టిలో ఉంచుకొని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చెలగల్‌లో 30 ఎకరాల విశాలమైన స్థలంలో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ రోజు (బుధవారం) నుండి అన్ని రకాల క్రయవిక్రయాలు చెలగల్ మార్కెట్ యార్డులోనే జరుగుతాయని పేర్కొన్నారు. కావున రైతు సోదరులం దరూ తమ ధాన్యం సరుకులను చెలగల్ మార్కెట్ యార్డుకు తరలించి, మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

తొలగించిన చందనం తూకం

- అంజన్న చందనం 99 కిలోల 720 గ్రాములు
- సీల్ వేసి భద్రపరచిన ఆలయ అధికారులు




మల్యాల, నవంబర్ 18, ప్రజాజ్యోతి : కొండగట్టు నందు నిర్వహిస్తున్న ఆంజనేయస్వామివారి చందనోత్సవ ఉత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారి మూలవిరాట్‌కు అలంకరించిన చందనాన్ని శాస్త్రోక్తంగా తొలగించడం జరిగిందని ఆలయ అధికారులు తెలిపారు.అనంతరం తొలగించిన చందనాన్ని చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు ఆధ్వర్యంలో తూకం వేయగా 99 కిలోల 720 గ్రాములు వచ్చిందన్నారు. అట్టి చందమును పంచనామా నిర్వహించి, తగిన భద్రతా చర్యలతో సీల్ వేసి భద్రపరచడం జరిగిందని ఆలయ అధికారులు తెలిపారు .ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనా రెడ్డి, ప్రధానార్చకులు, జితేంద్ర ప్రసాద్, చిరంజీవ స్వామి, మారుతీ ప్రసాద్, స్థానాచార్యులు కపిందర్ సహాయ కార్యనిర్వహణాధికారి, హరి హరనాథ్, పర్యవేక్షకులు సునీల్ కుమార్, పరిశీలకులు అశోక్, లక్ష్మా రెడ్డి, ఏ ఎస్ ఐ రామయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని విజయవంతం చేయాలి

- సీఎస్ సంజయ్ జాజు





జగిత్యాల టౌన్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి) : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జగిత్యాల కలెక్టరేట్ నుండి కలెక్టర్ బి.సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.నవంబర్ 19న సాయంత్రం సిద్దిపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభిస్తారని, అదే సమయంలో అన్ని జిల్లాలు, గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లోనూ పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం ప్రారంభం కావాలని సీఎస్ స్పష్టం చేశారు.రాబోయే రెండు వారాల పాటు ప్రతి గ్రామం, వార్డులో ప్రత్యేక దరఖాస్తుల స్వీకరణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బీమా పొందే వ్యక్తి, నామినీ వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందే లా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

పారుపల్లిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

- సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారుల్లో ఆనందం

ముత్తారం నవంబర్ 18 (ప్రజా జ్యోతి) ముత్తారం మండలంలోనిపారుపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కావడంతో లబ్ధిదారుల్లో ఆనందం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు పారుపల్లి గ్రామంలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలోని మానేరు వాగు ఒడ్డున ఉన్న శత్రాజ్‌పల్లి ప్రాంతంలో నివసిస్తున్ననిరుపేద ఎస్టీ కుటుంబాలకు మంజూరైన ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్ అందజేశారు.ఈ సందర్భంగా మేకల రజిత భీమని రమ, భీమని శారద, మేకల లక్ష్మి మల్లు, ముంజం అమూల్య తదితర లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించనుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న తమ కల నెరవేరే అవకాశం కల్పించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ, గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్, సీనియర్ నాయకులు పీక శంకర్, యూత్ అధ్యక్షులు కారుపాకల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలకు అతీతంగా చేయూత

- పైరవీలు లేకుండా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మల్యాల,నవంబర్ 18, ప్రజా జ్యోతి : పార్టీలకు అతీతంగా చేయూత పింఛన్ లను అర్హులైన లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని, పైరవీలకు తావు లేకుండా లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు అందేలా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుందని,మల్యాల లో జరిగిన చేయూత పింఛన్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం మల్యాల ఎక్స్ రోడ్డు సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్ లో మండలంలోని 19 గ్రామాలకు చెందిన 584మంది లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేయూత పింఛన్ మంజూరైన పత్రాలని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ మండలంలోని 584 లబ్ధిదారులకు వితంతు,వికలాంగుల,గీత కార్మికుల, ఒంటరి మహిళ పింఛన్లు మంజూరు చేసినట్టు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో స్వాతి, సర్పంచులు,సింగల్ విండో చైర్మన్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఘనంగా 593 మందికి చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

రాయికల్, నవంబర్ 18 (ప్రజా జ్యోతి) ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాయికల్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయికల్ మండలంలో మొత్తం 593 మందికి చేయూత పింఛన్లు మంజూరయ్యాయి. వీటిలో వితంతు పింఛన్లు 290, దివ్యాంగుల పింఛన్లు 106, కల్లుగీత కార్మికుల పింఛన్లు 120, ఒంటరి మహిళల పింఛన్లు 77 ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు. అర్హులైన పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, ఇతర అర్హులైన వర్గాలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. మొత్తం 593 కుటుంబాలకు సామాజిక భరోసా కల్పించే దిశగా ఈ పింఛన్ల మంజూరు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన కాంగ్రెస్ నేత

చొప్పదండి, నవంబర్ 18 (ప్రజా జ్యోతి): చొప్పదండి మండలం కోనేరుపల్లె, కాట్నపల్లి,సాంబయ్యపల్లె,గుమ్లాపూర్,చిట్యాలపల్లి,మంగళపల్లి గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయా గ్రామ సర్పంచులు,అధికారులతో కలిసి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఆర్నకొండ ప్యాక్స్ చైర్మన్ ఎన్నం మనోహర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి, తాలు, మట్టి లేకుండా శుభ్రం చేసి కేంద్రానికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గంగయ్య,సర్పంచులు వేణుగోపాల్,శ్రీనివాస్ రెడ్డి,రమాదేవి, ఆనంద్, లక్ష్మీ, శారద, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చందు, ఉప సర్పంచులు నరేందర్ రెడ్డి, నవీన్, బాలు, ఏవన్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ గణపతి రెడ్డి, మణిశంకర్ రెడ్డి, నెరుమట్ల మల్లేశం, బద్దెనపల్లి సతీష్, రవీందర్,ఈర్ల స్వామి,నల్లాల అఖిల్,పల్లపు కుమార్, బడుగు నరేష్,రైతులు, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భద్రత

- నవంబర్ 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు
- ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డులో ప్రత్యేక నమోదు శిబిరాలు
- రేషన్ కార్డు లేని కుటుంబాలకూ నమోదు అవకాశం
- డేటా లేదనే కారణంతో అర్హులను వెనక్కి పంపొద్దు
- అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 18, ప్రజా జ్యోతి:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. నవంబర్ 19 నుంచి ప్రారంభం కానున్న ఈ పథకానికి సంబంధించి జిల్లాలోని ప్రతి గ్రామం,మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.బుధవారం పెద్దపల్లి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఎంపీఓలు, మున్సిపల్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని పథకం అమలు విధానంపై దిశానిర్దేశం చేశారు. కుటుంబంలో సంపాదించే సభ్యునికి జీవిత బీమా కల్పించడం ద్వారా ఆకుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రతి జనావాసానికి క్యాంపు సౌకర్యం అందేలా అవసరమైన బృందాలను ఏర్పాటు చేయాలని, క్యాంపుల తేదీలు, ప్రదేశాలను ముందుగానే ప్రజలకు తెలియజేయాలని సూచించారు.డప్పు చాటింపు ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి క్యాంపులో హెల్ప్ డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లు ఏర్పాటు చేయాలని,రేషన్ కార్డులు లేని కుటుంబాలకోసం ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.వృద్ధులు, దివ్యాంగులు, బలహీన వర్గాలకు చెందిన వారికి ప్రాధాన్యతనిస్తూ సహాయం అందించాలని, తాగునీరు, కుర్చీలు, విద్యుత్, ఇంటర్నెట్, ప్రింటర్లు, పవర్ బ్యాకప్ వంటి సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్,సూపర్‌వైజర్,టెక్నికల్ అసిస్టెంట్‌తో ప్రతి క్యాంపు బృందం పనిచేసేలా చూడాలన్నారు.ప్రతిరోజూ నమోదైన దరఖాస్తులు, పెండిం గ్ వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు.పథకం కింద కుటుంబంలోని సంపాదించే సభ్యునికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తారని, 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులని కలెక్టర్ వివరించారు. 19-11-1967 నుంచి 18-11-2008 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులోని పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకుంటారని, కేవలం పుట్టిన సంవత్సరం మాత్రమే నమోదై ఉంటే జూలై 1వ తేదీని పుట్టిన తేదీగా పరిగణిస్తారని తెలిపారు.ఆహార భద్రత కార్డు ఉన్నకుటుంబాల వివరాలు మీ సేవలో ముందుగానే నమోదైన దరఖాస్తు రూపంలో అందుబాటులో ఉంటాయని, వాటిని పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకున్న అనంతరం బీమాదారుడు, నామినీ వివరాలు నమోదు చేయాలని సూచించారు. రేషన్ కార్డు లేని కుటుంబాలు కూడా ఖాళీ దరఖాస్తు ఫారం ద్వారా కొత్తగా నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఇందుకోసం బీమాదారుని ఆధార్ ప్రతితో పాటు కుటుంబ సభ్యుల వివరాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.నమోదు సమయంలో కుటుంబ సభ్యుల ఆధార్ నంబర్లు, మొబైల్ నంబర్, రేషన్ కార్డు (ఉంటే), నామినీ వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేసుకుంటే వారికి కేటాయించే క్లెయిమ్ వాటాల మొత్తం 100 శాతంగా ఉండాలని తెలిపారు. రేషన్ కార్డులో కుటుంబ సభ్యుని పేరు లేకపోయినా గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు అధికారి ధ్రువీకరణతో ఆ సభ్యుని వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.ముఖ్యంగా డేటా అందుబాటులో లేదనే కారణంతో ఏ ఒక్క అర్హుడినీ క్యాంపు నుంచి వెనక్కి పంపించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇతర జిల్లాలకు చెందిన ఆహార భద్రత కార్డులు ఉన్న కుటుంబాలు సైతం తమకు సమీపంలోని క్యాంపులో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రతి ఇంటికీ పథకం వివరాలు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో డీపీఓ శ్రీమాల, ఈడీఎం కవిత, ఎంపీడీవోలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో ఢిల్లీ

- డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో రాంలీలా మైదానంలో భారీ ధర్నా
- కార్మికులంతా లక్షలాదిగా తరలిరావాలి
- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు గీస భిక్షపతి



ముస్తాబాద్, నవంబర్ 18: (ప్రజా జ్యోతి): కార్మిక,కర్షకుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న భారీ ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ, సీడబ్ల్యూఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గీస భిక్షపతి పిలుపునిచ్చారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గీస భిక్షపతి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 1996లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డును యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్మికుల హక్కులను కాలరాసే విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ప్రతి కార్మికుడికి నెలకు కనీస వేతనం రూ.42 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులు, హమాలీ కార్మికులతో పాటు ఇతర రంగాల్లో పనిచేస్తున్న 55 ఏళ్ల నిండిన ప్రతి కార్మికుడికి నెలకు రూ.9 వేల పెన్షన్ అందించాలని కోరారు.అదేవిధంగా ఇళ్లు లేని నిరుపేద భవన నిర్మాణ కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని, కార్మికుల పిల్లలకు డిగ్రీ వరకు ఉచిత విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో ఢిల్లీలో జరిగే ధర్నాకు కార్మికులు, కర్షకులు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ హమాలీ సంఘం అధ్యక్షుడు కట్కూరి నరేష్, పిట్ల ప్రవీణ్, జంగం లింగం, చిలకల రాజేందర్, దీటి నరసయ్య తదితరులు పాల్గొన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులకు త్వరలో శ్రీకారం

- సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రణాళిక
- అవసరమైన చోట అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ
- పారిశుధ్య నిర్వహణలో ప్రజలు సహకరించాలి: మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 18, ప్రజాజ్యోతి: పెద్దపల్లి పట్టణంలోని అన్ని వార్డుల్లో విడతలవారీగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆధ్వర్యంలో పట్టణంలోని 36 వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీల నిర్మాణంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పట్టణంలో నిర్వహిస్తున్న పారిశుధ్య ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా బుధవారం 12, 13వ వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య స్థానిక కౌన్సిలర్లు దొడ్డుపల్లి జగదీష్, పాగల శ్రీకాంత్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డుల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి, స్థానికులతో మాట్లాడారు. ఆయా వార్డుల్లో గుర్తించిన అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. పట్టణ పరిశుభ్రత కేవలం మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని చైర్మన్ సూచించారు. ఖాళీ స్థలాల్లో చెట్లు, పిచ్చిమొక్కలు పెరగకుండా స్థల యజమానులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో, రోడ్లపై చెత్త వేయకుండా మున్సిపల్ సిబ్బంది విజిల్ వేస్తూ వచ్చినప్పుడు వారికి అందజేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఆరెపల్లి సురేందర్, వార్డు అధికారులు సాగర్, స్వరూప, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పులిపాక రాజు, ఎలక్ట్రీషియన్లు సత్యం, శ్రీకాంత్, వాటర్ సప్లై లైన్‌మెన్లు ప్రశాంత్, ఆనంద్, వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న పుట్ట దంపతులు



ముత్తారం,నవంబర్18(ప్రజా జ్యోతి) ముత్తారం మండల కేంద్రంలోని వెంకటలక్ష్మి గార్డెన్‌లో కేశనపల్లి గ్రామానికి చెందిన గౌరయ్య కుమారుడు అజయ్–సుస్మిత,ముత్తారం గ్రామానికి చెందిన ఇనుముల స్వరూప,ఉప్పలయ్య కుమార్తె అఖిల–అభిరామ్ వివాహ వేడుకల్లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్,ఆయన సతీమణి శైలజ దంపతులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈసందర్భంగా ఇరు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో ముత్తారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పొత్తుపెద్ది కిషన్ రెడ్డి,ముత్తారం గ్రామ సర్పంచ్ సుధాటి రవీందర్రావు,మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి,మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు నూనె కుమార్,ముత్తారం గ్రామ శాఖ అధ్యక్షులు అలుపోజు రవీందర్,మండల మహిళా అధ్యక్షురాలు పప్పు సరూప,కమాన్పూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు పప్పు చంద్రమౌళి,కూరాకుల ఓదెలు,పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేశ్
- చామన్‌పల్లిలో చేయూత పింఛన్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ



కొత్తపల్లి నవంబర్ 18, (ప్రజాజ్యోతి)కరీంనగర్‌రూరల్: అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని కరీంనగర్ డిసిసి అధికార ప్రతినిధి అనంతుల రమేష్ వెల్లడించారు.. బుధవారం కరీంనగర్ రూరల్ మండలం చామన్‌పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ భోగొండ ఐలయ్యతో కలిసి డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేష్ చేయూత పింఛన్ లబ్ధిదారులకు మంజూరు ప్రొసీడింగ్స్ అందజేశారు.ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు చేరేలా ప్రజాప్రతినిధులు, నాయకులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.చేయూత పింఛన్ ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వారి జీవనానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భోగొండ ఐలయ్య, ఉప సర్పంచ్ దూదం శ్రీనివాస్ , దీకొండ గంగయ్య జాలపల్లి విష్ణు శంకరయ్య, రామస్వామి పింఛన్ లబ్ధిదారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పి ఆర్ సీ నీ వెంటనే అమలు చేయాలి

- డి టీ ఎఫ్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి



ఇల్లంతకుంటనవంబర్18(ప్రజా జ్యోతి) పి ఆర్ సి రిపోర్టు తెప్పించుకొని అమలు చేయాలని, సిపిఎస్ ని రద్దు చేసి , జీపో 25ని సవరించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల డి టీ ఎఫ్ శాఖ అధ్యక్షులు తూముకుంట. నరేందర్ రెడ్డి డిమాండ్ చేసారు. బుధవారం రోజు మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి సభ్యత్వం నమోదుకార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో సంఘ బాధ్యులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా పిఆర్సి పెండింగ్లో ఉందని వెంటనే అమలు చేయాలని, ఇంకా పెండింగ్లో ఉన్న నాలుగు విడతల డిఏలు విడుదల చేయాలని, ఇ హేచ్ ఎస్ లో లోపాలను సవరించి పూర్తి స్థాయిలో పనిచేసేలా చూడాలని, జీపో నెంబర్ 25 ను సవరించాలని, ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయున్ని కేటాయించి, ప్రాథమిక పాఠశాలను బలోపేతం చేయాలని, సీపి ఎస్ వెంటనే రద్దుచేసి ఓపీఎస్ ను అమలు చేయాలని, 190 జీపో అమలు చేయాలని కేజీబీవీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తెలిపిన విధంగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు అన్నింటిని పరిష్కరించాలని డిమాండ్ చేసారు .ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు టీ నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ .రమేష్, పూర్వ జిల్లా అధ్యక్షులు రాష్ట్ర కౌన్సిలర్లు ఏ రాజేశ్వరరావు, డి శ్రీహరి, ఆర్ రామేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, సీనియర్ బాధ్యులు కే. రామకృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, స్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్షవాతం చికిత్సలో ప్రతి నిమిషం కీలకం

- సకాలంలో గుర్తిస్తే మెరుగైన ఫలితాలు
- డాక్టర్ జొన్నలగడ్డ మోహన కృష్ణ యశోద హాస్పిటల్ సోమాజిగూడ



కరీంనగర్ టౌన్ నవంబర్ 18(ప్రజా జ్యోతి) ఒత్తిడి, మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం, ధూమపానం, మద్యపానం వంటి జీవనశైలి కారకాల వల్ల అన్ని వయసుల వారిలో బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం), ఇతర నరాల సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ జొన్నలగడ్డ మోహన కృష్ణ తెలిపారు. బుధవారం నగరం లోని యశోద హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు 30 నుంచి 40 ఏళ్ల యువకుల్లోనూ పక్షవాతం కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. మంగళవారం కరీంనగర్ లో ఆయన మాట్లాడుతూ... స్ట్రోక్ లక్షణాలను త్వరగా గుర్తించి, ఆలస్యం చేయకుండా అత్యవసర వైద్యం అందించడం ద్వారా మెదడుకు కోలుకోలేని నష్టం జరగకుండా కాపాడవచ్చని చెప్పారు.ప్రజలు ఎల్లప్పుడూ 'ఫాస్ట్ ' హెచ్చరిక సంకేతాలను గుర్తుంచుకోవాలని సూచించారు. ముఖం ఒక వైపుకు వాలిపోవడం (ఎఫ్ –ఫేస్ డ్రూపింగ్), చేతుల్లో బలం తగ్గడం (ఏ – ఆర్మ్ వీక్ నెస్), మాట్లాడటంలో ఇబ్బంది కలగడం (ఎస్ –స్పీచ్ డిఫికల్టీ) వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అత్యవసర వైద్య సహాయం (టీ –టైమ్ టు సీక్ ఎమర్జెన్సీ మెడికల్ అటెన్షన్) తీసుకోవాలన్నారు. అలాగే మైగ్రేన్, మూర్ఛ (ఎపిలెప్సీ), పార్కిన్సన్స్, డిమెన్షియా వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో చికిత్స పొందాలని కోరారు. సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ లో 3 టెస్లా ఎంఆర్ఐ , సీటీ స్కాన్లు, ఈఈజీ , ఈఎంజీ , న్యూరో ఐసీయూ వంటి అధునాతన సదుపాయాలతో కూడిన ప్రత్యేక స్ట్రోక్ కేర్ సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.ఈ సమావేశంలో సీనియర్ మేనేజర్ సుధీర్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ పొన్నాల రాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి

ఇల్లందకుంట, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): ఇల్లందకుంట మండల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని బీజేపీ ఇల్లందకుంట మండల శాఖ ఆధ్వర్యంలో నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఇల్లందకుంట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మనోజ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి మాట్లాడుతూ.. రైతులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. తుఫాన్ ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ధాన్యం తడిసిపోకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ సంచులు, తూకం యంత్రాలు, ఇతర మౌలిక సదుపాయాలను వెంటనే అందుబాటులో ఉంచాలని కోరారు. రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండే పరిస్థితిని నివారించాలని అన్నారు. రైతుల సంక్షేమమే దేశ సంక్షేమమని, రైతులకు అన్యాయం జరిగితే భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. రైతుల సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. బీజేపీ నాయకులు ఇంగిలే ప్రభాకర్, చింతల ఐలయ్య, గుడికందుల పావని, జోడు సంపత్, గురుకుంట్ల సంజీవ్, రావుల అశోక్, శనిగరపు శ్రవణ్, వడ్లకొండ జలపతి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



అలుగునూరు సభను విజయవంతం చేయాలి

- ఈ నెల 29న కేసీఆర్ దీక్షా దివస్ సందర్భంగా భారీ బహిరంగ సభ
- పెద్దపల్లి నుంచి వేలాదిగా తరలిరావాలి
- కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు: మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 18, ప్రజాజ్యోతి: తెలంగాణరాష్ట్ర సాధనలో కీలక ఘట్టమైన కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షను స్మరించుకుంటూ ఈ నెల 29న కరీంనగర్ సమీపంలోని అలుగునూరులో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. సభకు పెద్దపల్లి జిల్లా నుంచి వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బుధవారం పెద్దపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కొప్పుల ఈశ్వర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన చారిత్రాత్మక ఆమరణ నిరాహార దీక్ష, ఆయన తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని నేటి తరానికి మరోసారి గుర్తుచేసేందుకే ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆనాడు కేసీఆర్ ఇచ్చిన 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అనే నినాదం తెలంగాణ ఉద్యమంలో కీలక మలుపుగా నిలిచిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు ప్రస్తుత పాలనలో నిర్వీర్యమవుతున్నాయని ఆరోపించారు. రైతుబంధు, రైతు బీమా అమలు, నిరంతర విద్యుత్ సరఫరా, యూరియా పంపిణీలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం రైతుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని, మూడు పంటలకు రైతుబంధు అందిస్తామని ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతుల నుంచి ధాన్యం సేకరించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, తిరిగి కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని కొప్పుల ఈశ్వర్ వ్యాఖ్యానించారు. ఈ నెల 29న అలుగునూరులో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయడం ద్వారా పార్టీ శ్రేణుల ఐక్యతను చాటాలని, పెద్ద సంఖ్యలో జనసమీకరణ చేపట్టాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యస్. జి. ఎఫ్. ఐ. రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో కాంస్య పథకం సాధించిన పారమిత విద్యార్థులు



కరీంనగర్ టౌన్ నవంబర్ 1(8 ప్రజా జ్యోతి) ఈ నెల 13 నుండి 15 వ తేదీ వరకు తెలంగాణ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా లో జరిగిన 70 వ యస్. జి. ఎఫ్. ఐ. తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్–17(బాల బాలికల) హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో స్థానిక పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల చెందిన సి.హెచ్. భువన , చెందిన ఏ. మోక్షజ్ఞ అత్యుత్తమ ప్రతిభ మ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలలో కాంస్య పథకం సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ తెలిపారు. రాష్ట్రస్థాయిలో పథకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ ఇ. ప్రసాదరావు మరియు డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వి.యు. యం.ప్రసాద్, ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల డైరెక్టర్ కె.హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, సమన్వయ కర్తలు నాగరాజు, రాము, రబీంద్ర పాత్రో మరియు వ్యాయామ ఉపాధ్యాయుడు అమరేందర్ ,రాజు, సాజన్ లు పాల్గొన్నారు.

రైతు వేదికలో రైతులకు ఎలనినో పట్ల అవగాహన కార్యక్రమం



ఇల్లంతకుంటనవంబర్ 18(ప్రజాజ్యోతి) రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల రైతు వేదికలో బుధవారం రోజు గ్రామ సర్పంచ్ నేరెళ్ళ విజయ్ గౌడ్ ఆధ్వర్యంలో యాసంగిలో ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయంపై కలిగే ప్రభావాలు రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరిస్తూ వరికి బదులుగా తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి పంటలు సాగు చేయాలని వివరించరుకేత్ బచావో అభియాన్ ప్రోగ్రాం లో భాగంగ రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులు వేస్తూ నేల ఆరోగ్యం కాపాడాలని సూచించారు.ఈ కార్యక్రమం లో మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ (DCO),మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, మండల రెవెన్యూ అధికారి రచకట్ల సురేష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శశికళ,అర్ డబ్ల్యూ ఎస్ ఏ ఇ ఇ అఖిల్, ఇరిగేషన్ఏ ఇ దిలీప్ ,ఏఈవో రవళి ,ఏపీఎం కుమార స్వామి , గ్రామ పాలన అధికారి ఆంజనేయులు పంచాయతి కార్యదర్శి శ్రీనివాస్ ,ఉపసర్పంచ్లు,ఏఎమ్సీ , పిఏసీఎస్ డైరెక్టర్ లు,వార్డ్ మెంబర్స్,రైతులు పాల్గొన్నారు.

చెస్ పోటీలకు ఎంపికైన దర్యాపూర్ టీజీ మోడల్ స్కూల్ విద్యార్థులు



ముత్తారం నవంబర్ 18 (ప్రజా జ్యోతి) పెద్దపల్లి జిల్లా స్థాయిలో నిర్వహించిన చెస్ పోటీలలో ముత్తారం మండలం దరియాపూర్ లోని టీజీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు, మండలానికి గర్వకారణంగా నిలిచింది.ఈ పోటీలలో అండర్–14 విభాగంలో 9వ తరగతి చదువుతున్న చిప్ప విష్ణుసాయి, అండర్–17 విభాగంలో 10వ తరగతి చదువుతున్న శ్రీవర్షిత్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు.ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పెద్దపల్లి జిల్లా స్థాయి నుంచి కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయికి ఎంపిక కావడం పాఠశాలతో పాటు ముత్తారం మండలానికి ఎంతో గర్వకారణం. మండల విద్యాశాఖ అధికారి హరిప్రసాద్, గ్రామ సర్పంచ్ రాపల్లి రాజయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ కేసరి సంతోష్ కుమార్ ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, మరియు పలువురు కూడా చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ తమ ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని ప్రశంసించారు.

అందుబాటులోకి ప్రత్యేక యాత్రల బస్ సర్వీసులు

- గోదావరిఖని డిపో మేనేజర్ కవిత



గోదావరిఖని, నవంబర్ 17 (ప్రజాజ్యోతి): టి జి ఎస్ ఆర్టీసీ గోదావరిఖని డిపో ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పుణ్యక్షేత్ర దర్శన యాత్ర ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చినట్లు డిపో మేనేజర్ కవిత తెలిపారు.ఈ సందర్భంగా గోదావరిఖని పరిసర ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలను సందర్శించారు.ప్రత్యేక పూజలు నిర్వహించారు.సుందిళ్ల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం,స్థానిక రామ మందిరం,ఎల్ఐ నగర్ పంచముఖ ఆలయం,దుర్గాదేవి ఆలయం,జవహర్ నగర్ హనుమాన్ ఆలయం,తిలక్ నగర్ డౌన్ సత్యనారాయణ స్వామి ఆలయాలతో పాటు ఎన్ టి పి సి,గౌతమినగర్‌లోని సాయిబాబా ఆలయం,హనుమాన్ ఆలయం,అయ్యప్ప స్వామి దేవాలయాలలో డిపో మేనేజర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి ఆలయ వేద పండితులకు, భక్తులకు ఆర్టీసీ అందిస్తున్న ప్రత్యేక యాత్ర ప్యాకేజీల వివరాలను వివరించారు.సుందిళ్ల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ వేద పండితులు డిపో మేనేజర్ కవితను చీర,సారెలతో ఘనంగా సత్కరించారు.అయ్యప్ప భక్తులకు ప్రత్యేక సర్వీసులు శుభకార్యాలకు అద్దె బస్సులు,శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం డిపో నుండి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిఎం తెలిపారు.పెళ్లిళ్లు,శుభకార్యాలు,విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.కనీసం 30 మంది సభ్యులు ఒక బృందంగా ఏర్పడితే వారు కోరుకున్న పుణ్యక్షేత్రాలు,పర్యాటక ప్రాంతాలకు వారు మెచ్చిన తరహా బస్సులను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.సురక్షితమైన ప్రయాణానికి ప్రజలు,భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.యాత్రల వివరాలు,బస్సుల ముందస్తు బుకింగ్ కోసం 7013504982, 7382847596 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం యాత్రలకు సంబంధించిన వాల్ పోస్టర్లు,కరపత్రాలను విడుదల చేశారు. అసిస్టెంట్ మేనేజర్ నజీర్,యాత్రల పర్యవేక్షకులు రాజిరెడ్డి పాల్గొన్నారు.

దళిత ఎంపీని అవమానించడం తగదు

- ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ ప్రకారం గౌరవం కల్పించాలి



సుల్తానాబాద్, నవంబర్ 18(ప్రజా జ్యోతి): ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో నిరంతరం గళమెత్తుతూ, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణను ప్రభుత్వ కార్యక్రమంలో ప్రోటోకాల్ పేరుతో అవమానించడం బాధాకరమని దళిత సామాజిక హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం సతీష్ కుమార్ అన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలో నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో చోటుచేసుకున్న పరిణామాలను ఆయన తీవ్రంగా ఖండించారు. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గంలోని ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉండటంతో సకాలంలో హాజరుకాలేకపోయారని, ఈ నేపథ్యంలో అధికారులు ప్రోటోకాల్ నిబంధనలను అనుసరించి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ చేపట్టి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. అయితే అధికారులు కలెక్టర్ రాక కోసం ఎదురుచూస్తూ ఎంపీకి తగిన ప్రాధాన్యం కల్పించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.కొందరు వ్యక్తులు తమ స్వప్రయోజనాలు, రాజకీయ గుర్తింపు కోసం సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ఎంపీని అడ్డుకున్నామంటూ విషప్రచారం చేయడం విచారకరమన్నారు. ఇకనైనా ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం కల్పించాలని, అధికారులు ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని డిమాండ్ చేశారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరగని అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేపడుతున్నారని, ఆయన నాయకత్వంపై విశ్వాసంతోనే ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించారని గుర్తుచేశారు. దళిత ఎంపీ వంశీకృష్ణపై విమర్శలు చేసే ముందు సంబంధిత నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని గడ్డం సతీష్ కుమార్ ఈ సందర్భంగా హితవు పలికారు.

విదేశీ ఉద్యోగాల మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- నవంబర్ 20న పెద్దపల్లిలో రిజిస్ట్రేషన్ మేళా : కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 18 ప్రజా జ్యోతి: పెద్దపల్లి జిల్లా నిరుద్యోగ యువత విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. TOMCOM, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 20న పెద్దపల్లి ఐడీఓసీ భవనంలోని జిల్లా ఉపాధి కార్యాలయం గది నంబర్ 233లో విదేశీ ఉద్యోగాల రిజిస్ట్రేషన్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.జర్మనీ, ఆస్ట్రియా, ఐర్లాండ్, అమెరికా, జపాన్, దుబాయ్ సహా 12 దేశాల్లో నర్సింగ్, వైద్య సేవలు, నిర్మాణరంగం, డ్రైవింగ్, వెల్డింగ్, కేర్ వర్కర్ల విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా ఉద్యోగాలకు నిర్దేశించిన విద్యార్హతలు, నైపుణ్యాలు కలిగిన యువతీ యువకులు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డుతో మేళాకు హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.మరిన్ని వివరాలకు 080 3552 4946, 8985336947, 8121262441 నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

ధర్మారంలో గంజాయి విక్రయాలకు చెక్

- ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిందితుడి అరెస్ట్



ధర్మారం, నవంబర్ 18(ప్రజా జ్యోతి) :ధర్మారం శీతల చెరువు వద్ద 204 గ్రాముల గంజాయి స్వాధీనం,గంజాయి విక్రయించేందుకు వచ్చిన వ్యక్తి అరెస్ట్.. కేసు నమోదు ధర్మారం మండలంలోని శీతల చెరువు వద్ద గంజాయి విక్రయించేందుకు వచ్చిన వ్యక్తిని పోలీసులు పట్టుకుని అతడి వద్ద నుంచి 204 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ధర్మారం ఎస్సై ఎంబడి శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం సుమారు 12 గంటల ప్రాంతంలో సుల్తానాబాద్ గ్రామం జవహర్ నగర్‌కు చెందిన వేముల శ్రీనివాస్ (53),తండ్రి గురువులు, గంజాయిని విక్రయించేందుకు ధర్మారం శీతల చెరువు వద్దకు వచ్చినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 204 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది.గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిపైకేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్సై ఎంబడి శ్రీకాంత్ మాట్లాడుతూ.. గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయం, వినియోగం చట్టరీత్యా నేరమని తెలిపారు.యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. గ్రామాలు, పట్టణాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు లేదా సరఫరా చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.సమాచారం అందించిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

హెచ్ఐవీ నియంత్రణలో తెలంగాణకు జాతీయ స్థాయిలో రెండో స్థానం

- సురక్షిత్ హోదా సాధించిన పెద్దపల్లి జిల్లా



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 18 ప్రజా జ్యోతి: హెచ్ఐవీ నియంత్రణలో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో రెండో స్థానాన్ని సాధించింది.జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) తాజా స్కోర్‌కార్డులో రాష్ట్రం ఈ ఘనత సాధించగా, రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 20 జిల్లాలు సురక్షిత్ (Surakshit) హోదా పొందాయి. వీటిలో పెద్దపల్లి జిల్లా కూడా స్థానం సంపాదించింది.డిసెంబర్ 2023లో జాతీయ స్థాయిలో 32వ స్థానంలో ఉన్న తెలంగాణ,గత ఆర్థిక సంవత్సరంలో 13వ స్థానానికి చేరుకుని ప్రస్తుతం రెండో స్థానానికి ఎదిగింది. హెచ్ఐవీ నియంత్రణలో నిర్దేశించిన 95-95-95 లక్ష్యాలను సాధించిన 20 జిల్లాల కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సన్మానించనుంది.పెద్దపల్లి జిల్లాకు ఈ గుర్తింపు లభించడం జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, కార్యక్రమ భాగస్వాముల సమిష్టి కృషికి నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలి

- మామిడి అనిల్ కుమార్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు



తిమ్మాపూర్, నవంబర్ 18(ప్రజా జ్యోతి):-తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఐదులక్షల జీవిత బీమా భరోసా కల్పించడం ప్రభుత్వ లక్ష్యం ఈ నెల 19వ తేదీ నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం కాబోతోంది.ఈ పథకానికి సంబంధించి ప్రతి రేషన్ కార్డు కలిగిన కుటుంబంలో ఇంటి పెద్దగా ఉన్న వ్యక్తి లేదా కుటుంబం తరపున బీమా కోసం ఎంపిక చేసుకున్న వ్యక్తి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తు ప్రక్రియ కోసం రేషన్ కార్డు, ఆధార్ కార్డు,నామినీ వివరాలు వంటి అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకుని సంబంధిత గ్రామపంచాయతీ కార్యాలయంలో లేదా ప్రభుత్వం సూచించిన కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలని ప్రజలకు తెలియజేశారు.ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే ఉద్దేశంతో రూపొందించబడిందని, ప్రతి అర్హత గల కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని జిల్లాల మండలాల గ్రామాల ప్రజలు ఈ పథకంపై అవగాహన కలిగి ఉండి, అవసరమైన పత్రాలతో సిద్ధంగా ఉండాలని,ఏ ఒక్క అర్హత కలిగిన కుటుంబం కూడా ఈ పథకం ప్రయోజనాన్ని కోల్పోకూడదని అనిల్ కుమార్ మామిడి విజ్ఞప్తి చేశారు.

అంకంపల్లి గ్రామంలో చేయూత పెన్షన్ మంజూరు పత్రాలు అందజేత

- సర్పంచ్ కొత్తూరి లక్ష్మీ మొండయ్య

కాల్వ శ్రీరాంపూర్ నవంబర్ 18 (ప్రజా జ్యోతి)కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని .అంకంపల్లి గ్రామంలోని .లబ్ధి దారులకు చేయూత పెన్షన్ మంజూరి పత్రాలను.సర్పంచ్ కొత్తూరు లక్ష్మీ మొండయ్య బుధవారం రోజున అందజేశారు .ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ యాసిన్ .ఉప సర్పంచ్ రాజ్ కుమార్. వార్డు సభ్యులు మారుపాక స్వరూప శ్రీనివాస్.లబ్ధిదారులు.తదితరులు పాల్గొన్నారు.



శాంతిభద్రతల పరిరక్షణ,ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రథమ కర్తవ్యం

- పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం





కరీంనగర్‌క్రైం, నవంబర్ 18, (ప్రజాజ్యోతి):శాంతిభద్రతల పరిరక్షణ,ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రథమ కర్తవ్యమని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు.బుధవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ అధికారులతో నిర్వహించిన వారాంతపు నేర సమీక్ష సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడారు.కేసుల దర్యాప్తు పురోగతి,పెండింగ్ కేసుల పరిష్కారం, శాంతిభద్రతల పరిస్థితులపై సమీక్షించారు.కొత్తగా అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ) చట్టాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వాటి నిబంధనలకు అనుగుణంగా కేసుల నమోదు, దర్యాప్తు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.చిన్నపాటి నేరాలు,న్యూసెన్స్, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ఈ-పెట్టీ కేసుల నమోదు ద్వారా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.దర్యాప్తు పూర్తయిన పెండింగ్ కేసుల్లో జాప్యం చేయకుండా వెంటనే చార్జిషీట్లు దాఖలు చేయాలని స్పష్టం చేశారు.అండర్ ఇన్వెస్టిగేషన్ (యూఐ) కేసుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.పోలీస్ అధికారులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ,బాధితుల సమస్యలపై తక్షణమే స్పందించాలని,వారికి సత్వర న్యాయం అందేలా విధులు నిర్వహించాలని సీపీ సూచించారు.ఈ సమావేశంలో ఏసీపీలు శ్రీనివాస్,వెంకటస్వామి,విజయకుమార్‌తో పాటు సీఐలు,ఎస్ఐలు,ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఐకేపీ పంట కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

- దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తూ రైతులను గోస పెడుతున్న కాంగ్రెస్ సర్కార్
- బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం డిమాండ్



తిమ్మాపూర్నవంబర్ 18 (ప్రజాజ్యోతి): -జిల్లాలో పరికోతలు పూర్తయినప్పటికీ ఇప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంపై బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.పంట కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బుధవారం తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సాయిని మల్లేశం మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు నేటికీ రైస్ మిల్లులనుకేటాయించకపోవడం, ఒక్క క్వింటాల్ ధాన్యం కూడా కొనుగోలు చేయకపోవడం చూస్తుంటే అధికారులు ప్రైవేట్ వ్యాపారులతోకుమ్మక్కయ్యారనే అనుమానం కలుగుతోందని ఆరోపించారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి గోదాములకు తరలించాల్సిన అధికారులు, మిల్లుల కేటాయింపులో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.దీని వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రైతుల నిస్సహాయతను దళారులు ఆసరాగా చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర కంటే క్వింటాలుకు రూ. 200 నుండి రూ. 300 తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వమే దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తూ రైతులను గోసపెట్టే ప్రయత్నం చేస్తున్నట్టు స్పష్టంగా కనబడుతుందన్నారు. ప్రధానంగా ధాన్యం కొనుగోలు విషయాల్లో తక్షణమే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న జిల్లా పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఐకెపి కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి,జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర,జిల్లా కార్యవర్గ సభ్యులు మాఊరపు సంపత్ కుమార్ , బూట్ల శ్రీనివాస్ , రామ్ హనుమాన్ నగర్ సర్పంచ్ పిసికా సౌజన్య కృష్ణ కిషోర్, అందే శేఖర్ ,గొట్టిముక్కల తిరుపతిరెడ్డి, గడ్డం అరుణ్, ఎర్రోజు లక్ష్మణ్ ,కొయ్యడ శ్రీనివాస్ , మహేందర్ రెడ్డి , ఓంకార్ యాదవ్, సుద్దాల సతీష్ ,ఎలకపల్లి స్వామి, కందుకూరి ఈశ్వర చారి ,బుడిగ నరేష్ ,పాశం సంపత్ ,తొర్తి సంతోష్ ,వేల్పుల నరేష్, ప్రశాంత్ ,వినయ్, చింతల సంపత్ రెడ్డి, బూరుగు శ్రీనివాసరెడ్డి, కామెర వెంకటేష్, సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

తాజా మాజీ సర్పంచ్‌కు 'చేయూత' పెన్షన్ పత్రం అందజేత



గంగాధర 18/నవంబర్/2026: (ప్రజా జ్యోతి): గంగాధర మండలం కొండ య్యపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఆముదాల వెంకటమ్మకు నూతన 'చేయూత' పెన్షన్ మంజూరు పత్రాన్ని ఆ గ్రామ ప్రస్తుత సర్పంచ్ మల్యాల తిరు పతి (అలియాస్ వినయ్ సాగర్) బుధవారం అందజేశారు.గ్రామంలో నిర్వ హించిన కార్యక్రమంలో భాగంగా ఆయన వెంకటమ్మ నివాసానికి వెళ్లి, ప్రభు త్వం తరఫున మంజూరైన పింఛన్ ప్రొసెసింగ్ పత్రాన్ని స్వయంగా చేతికిచ్చా రు. మాజీసర్పంచ్‌కు పింఛన్ మంజూరు పత్రం అందజేయడంతో ఆమె సంతో షం వ్యక్తం చేశారు. మొత్తం గ్రామంలో 24 పెన్షన్లు మంజూరయ్యయని సర్పం చ్ తెలిపారు. మల్యాల తిరుపతి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థాని క ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు , పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

టీఎస్ యుటిఎఫ్ ఎల్లారెడ్డిపేట మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

► అధ్యక్షుడిగా తుమ్మనపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శిగా పసుల సత్తయ్య





ఎల్లారెడ్డిపేట, నవంబర్ 18 ప్రజా జ్యోతి: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్ యుటిఎఫ్ ఎల్లారెడ్డిపేట మండల నూతన కమిటీని బుధ వారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నార టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుండమ నేని మహేందర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు ఆధ్వర్యంలో జరి గిన ఈ ఎన్నికల ప్రక్రియకు జిల్లా కార్యదర్శి కొత్వాల్ ప్రవీణ్ ఎన్నికల పరిశీల కులుగా హాజరయ్యారు. ఈ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా తుమ్మనపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శిగా పసుల సత్తయ్య, ఉపాధ్యక్షురాలిగా ఎస్. పద్మ, కోశాధికారిగా అజయ్ ఎన్నికయ్యారు. మండల కార్యదర్శులుగా లావణ్య, సౌజన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కా రానికి, విద్యారంగ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యా యుల హక్కుల పరిరక్షణతో పాటు విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సంఘాన్ని ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత

► గుండారం కృష్ణారెడ్డి



ఎల్లారెడ్డిపేట నవంబర్ 18 (ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన గుండం కౌసల్య కుమార్తె వివాహం సందర్భంగా నిరుపేద కుటుం బానికి అండగా నిలుస్తూ రూ.5,000 ఆర్థిక సహాయం అందించిన జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్య క్షులు, ఎల్లారెడ్డిపేట ఫ్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి.ఈ సందర్భంగా కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ సామాజిక సేవలో ముందుంటున్న గుండారపు కృష్ణారెడ్డి ని పలు వురు అభినందించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రేసు జగన్, గాదం రామదాసు, గుంటుక రామరాజు, మంగరపు రాజం, లింగాల శ్రీనివాస్, లింగాల రాజయ్య, లింగాల చంద్రం, కొప్పెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- సైదాపూర్‌లో 642 మందికి చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ
- గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి – మంత్రి పొన్నం ప్రభాకర్



సైదాపూర్ నవంబర్ 18 (ప్రజా జ్యోతి)

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నా బాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం లోని సైదాపూర్ మండలానికి చెందిన 642 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ.. కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలి పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగి ఉండి ఇప్పటివరకు పింఛన్లు పొందని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏడు రకాల పింఛన్లకు అర్హులైన వారందరికీ దశలవారీగా పింఛన్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. వృద్ధాప్య పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా త్వరలోనే మంజూరు చేస్తామని వెల్లడించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. గ్రామాల్లో నిర్వ హించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.దివ్యాంగులు, వృద్ధులకు అవ సరమైన సహాయక పరికరాలను అందించేందుకు ప్రత్యేక వైద్యనిర్ధారణ శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలి పారు. ఇప్పటికే ఎంపీడీవో కార్యాల యంలో పేర్లు నమోదు చేసుకున్న అర్హులకు బ్యాటరీ రిక్షాలు, చేతి కర్రలు, వినికిడి యంత్రాలు, కృత్రిమ అవయ వాలు, బెల్టులు తదితర పరికరాలను నేరుగా వారి ఇళ్ల వద్దకే పంపిణీ చేస్తా మని చెప్పారు. ఇంకా నమోదు చేసు కోని అర్హులు ఈ నెల 25, 26 తేదీల్లో హుస్నాబాద్‌లో జరిగే శిబిరానికి హాజ రుకావాలని సూచించారు.

›» గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికితీయాలి

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా సదుపా యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని మంత్రి తెలి పారు. చిన్న గ్రామాలకు రూ.లక్ష, పెద్ద గ్రామాలకు రూ.2 లక్షల చొప్పున నిధులు అందిస్తున్నట్లు చెప్పారు. జన వరి 1వ తేదీలోపు ప్రతి గ్రామంలో రెండు కబడ్డీ, రెండు ఖో-ఖో, రెండు వాలీబాల్ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని సర్పంచులకు సూచించారు. యువత ఆరోగ్య పరిర క్షణ కోసం గ్రామాల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుం టామని వెల్లడించారు.

›» ప్రతి గ్రామంలో ఊటకుం టల నిర్మాణం చేపట్టాలి

భూగర్భ జలాలను పెంపొందించడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం ప్రతి గ్రామం బాధ్యతగా తీసుకోవాలని మంత్రి సూచించారు. జలసిరి కార్యక మాన్ని పకడ్బందీగా అమలు చేయా లని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, వ్యవసాయ భూముల్లో ఫామ్ పాండ్స్ నిర్మించాలని తెలిపారు. గ్రామానికి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వ్యయంతో నాలుగు నుంచి ఐదు ఊటకుంటలు నిర్మించాలని ఆదేశిం చారు. సీసీ రోడ్ల పక్కన సోక్ పిట్స్ ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకో వాలని సూచించారు. ఊటకుంటల నిర్మాణంలో నిర్లక్ష్యం వహించే గ్రామా లకు ఇతర అభివృద్ధి నిధుల నిలిపివే తకు చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు.

›» ఇందిరమ్మ ఇళ్ల కేటాయిం పులో పారదర్శకత పాటిం చాలి

గత పదేళ్లలో అనేక నిరుపేద కుటుం బాలకు ఇళ్లు అందకపోవడంతో ప్రస్తుతం అర్హులైన లబ్ధిదారుల సంఖ్య పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని 173 గ్రామాలకు సమాన ప్రాధాన్యత నిస్తూ ఇందిరమ్మ ఇళ్లను కేటాయించా లని అధికారులకు సూచించారు. రాజ కీయాలకు అతీతంగా నిజమైన నిరుపే దలను గుర్తించి, అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయాలని, ఆడపిల్లల తల్లిదండ్రులకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

›» కార్మిక కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా

సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలోనే తొలిసారిగా ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి తెలి పారు. వృత్తి, పని ఏదైనా జీవనోపాధి కోసం కష్టపడే వ్యక్తి మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం అందించేలా ఈ పథకాన్ని రూపొందించినట్లు వివరించారు. అలాగే జీవో నంబర్ 566 ప్రకారం పింఛన్ పొందుతున్న లబ్ధిదారుడు మరణిస్తే, నిబంధనల మేరకు వారి కుటుంబ సభ్యులకు పింఛన్ బదిలీ ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశిం చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికా రులు క్షేత్రస్థాయిలో బాధ్యతాయు తంగా పనిచేయాలని సూచిం చారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ, డీపీవో, మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, సింగిల్ విండో చైర్మన్ తిరుపతి రెడ్డి, నాయకులు గుండారం శ్రీనివాస్.వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల,జిల్లా స్థాయి అధికారులు తది తరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ, ఎల్లమ్మ బోనాలు

■ ఇంటికో బోనమెత్తిన గౌడ సంఘం మహిళలు



ఎల్లారెడ్డిపేట నవంబర్ 17(ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో స్థానిక గౌడ సంఘం ఆధ్వ ర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట నూతన ఆలయ ప్రవేశం సందర్భంగా మంగళవారం గ్రామ దేవత శ్రీ పోచమ్మ తల్లి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కి గ్రామంలోని గౌడ సంఘం మహిళలు ఇంటికో బోనం ఎత్తి ఘనంగా బోనాలు పండుగను జరుపుతున్నారు..మహిళలు బోనాలను ఎత్తుకొని డప్పు చప్పుల మధ్య పోతరాజుల విన్యాసాలతో శివసత్తుల పూనకాలతో సమూహికంగా ఊరేగింపుగా పోచమ్మ వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించుకుని అక్కడి నుండి ఎల్లమ్మ ఆలయానికి వెళ్ళి బోనాలను ఎల్లమ్మ తల్లికి తీపి కూరగాయ వంటలతో సమర్పించుకున్నారు, తమ వృత్తిని పాడిపంట ను పిల్ల పా పలను సల్లంగా చూడాలని శ్రీ పోచమ్మ తల్లిని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ని మొక్కు న్నారు, శ్రీ పోచమ్మ తల్లికి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి బోనాల సమర్పించుకోవడాని కి ఊరేగింపుగా వెళ్ళిన మహిళలను చూసి గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం.. 2049 రోజులుగా నిరంతర అన్నదానం

♦ చిన్నారి కిరణ్మయి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేసిన తల్లిదండ్రులు

వేములవాడ,నవంబర్,18:ప్రజాజ్యోతి. అన్నదానం మహాదానం అనేనినాదంతో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిరంతర అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమం ద్వారా ఇప్పటివ రకు 2049 రోజులుగా పేదలు, నిరుపేదలు, ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేస్తూ సేవాభావాన్ని చాటుకుంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక టీటీడీ ధర్మశాల, రాజన్న భీమేశ్వర ఆలయం వద్ద పేదలు, అన్నార్తులు, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈరోజు అన్నదాతలుగా సను గుల గ్రామానికి చెందిన చిన్నారి లింగంపల్లి కిరణ్మయి పుట్టినరోజు సందర్భంగా ఆమె తల్లిదండ్రులు సత్యనారాయణ, వనిత దంపతులు అన్నదాన కార్యక్రమానికి ముందుకు వచ్చి నిరుపేదలకు భోజనం అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వా హకులు మాట్లాడుతూ..దాతలు అందించే ప్రతి రూపాయి,ప్రతి ఒక్కరి సహకారం



ఆకలితో ఉన్న వారి కడుపు నింపేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలి పారు. సమాజంలో ఆకలితో అలమటిస్తున్న పేదలకు అన్నం పెట్టడం ఎంతో పుణ్య కార్యమని పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్నప్రతి దాతకు, సేవ లందిస్తున్న ట్రస్ట్ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సేవాభావం కలిగిన ప్రతి ఒక్కరూ ఈ మహత్తర సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్‌కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, పొలాస రాజేందర్, సగ్గు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజుల పాటు కన్యకా పరమేశ్వరి అమ్మవారికి విశేష పూజలు

- పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు.. భక్తులకు అన్నదానం
- ముస్తాబాద్‌లో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న వేడుకలు





ముస్తాబాద్, నవంబర్ 18 (ప్రజా జ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి పీఠం ముస్తాబాద్ మండల కేంద్రానికి చేరుకోవడంతో పట్టణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ సందర్భంగా మండల ఆర్యవైశ్య మహిళా సభ్యులు ఐదు రోజుల పాటు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.ప్రతిరోజూ విశేష పూజలు చేస్తూ అమ్మవారికి భక్తితో సేవలు సమర్పించారు.కార్యక్రమంలో భాగంగా చివరి రోజున అమ్మవారి విగ్రహానికి అత్యంత వైభవంగా పంచామృత అభిషేకాలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ మంగళహారతులు సమర్పించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఆర్యవైశ్య కుటుంబాలపై అమ్మవారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజుల పాటు మహిళా సభ్యులు ఐకమత్యంతో పూజా కార్యక్రమాలను నిర్వహించడం విశేషంగా నిలిచింది. భక్తితో అమ్మవారిని ఆరాధించడంతో పాటు అన్నదానం ద్వారా సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సంతోష్, గౌరవ అధ్యక్షుడు బిక్షపతి, కమిటీ సభ్యులు విజయ్ కుమార్, చంద్రం, సత్తయ్య, రమేష్, భూమేష్, శ్రీకాంత్, శ్రీనివాస్, రాజు, బాలరాజు, శంకరయ్యతో పాటు ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదల అభివృద్ధి,సంక్షేమమే మా ధ్యేయం

- పైలాన్ తొలగింపు పై అనవసరపు రాద్ధాంతం
- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



గోదావరిఖని, నవంబర్ 18 (ప్రజాజ్యోతి) :అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేస్తూ విమర్శలకు సమాధానం చెప్తామని రామగుండం ఎం ఎల్ ఎ ఎం. ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు.బుధవారం గోదావరిఖని చౌరస్తాలో చేయూత కొత్త ఫించన్ల మంజూరీ పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తరువాత సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు.పేద వాళ్ళను వెదికి వెదికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని,మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం,రాయితీ గ్యాస్ సిలిండర్ అమలవుతుండగా ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19వ తేదీన కొత్త పింఛన్ డబ్బులు నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కాబోతున్న నేపధ్యంలో మధ్య దళారీ లను నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని అన్నారు.ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లాలని,నవంబర్ 19న మరో కొత్త పథకం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అమల్లోకి రాబోతున్నదని,ఆదార్,నామినీ వివరాలు వెంటనే నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సంపాదించే వ్యక్తి మరణిస్తే ఈ పథకం కింద ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందుతుందన్నారు.రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అడ్డుగా ఉన్న పైలాన్ ను వేరే చోటకు తరలించే ప్రయత్నం చేస్తే రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు.నగరంలో విలువైన చాలా స్థలాలను ఆక్రమణల నుండి కాపాడి ప్రభుత్వానికి అప్పగించామని అన్నారు.డబల్ బెడ్ రూమ్ ల నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలిస్తే రూ 40 కోట్లు వెచ్చించి అవసరమైన వసతులు కల్పించి ఉపయోగం లోకి తీసుకు వచ్చి లబ్దిదారులకు అప్పగించామన్నారు. వెనుక బడి ఉన్న రామగుండంలో ఉండలేక వలస పోదామనుకున్నవాళ్ళు ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇక్కడే స్థిర పడి పోదామని నిర్ణయించుకున్నారని అన్నారు. రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ రామగుండంలో ప్రతి రెండో ఇంటిలో ఫించను లబ్దిదారు ఉన్నారని అన్నారు.మొత్తం 52 వేల ఇండ్లు ఉంటే కొత్తగా మంజూరైన వాటితో కలిపితే 22 వేల 700 ఫించన్లు ఉన్నాయని అన్నారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవడానికి వీలుగా అన్ని డివిజన్ లలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు),రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె.అరుణ శ్రీ మాట్లాడుతూ చేయూత ఫించను కొరకు సమర్పించిన ధరఖాస్తులను ఆన్ లైన్ వెరిఫికేషన్ తో పాటు క్షేత్ర స్థాయి పరిశీలన చేసిన అనంతరం అర్హులైన 3111 మందిని ఎంపిక చేసి మంజూరు పత్రాలు ఇస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య,తహశీల్దార్ రవీందర్ కార్పొరేటర్లు,కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

11వ డివిజన్‌లో పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ

- పేదలు, మహిళల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఆకుల నరసన్న పటేల్





కరీంనగర్ టౌన్ నవంబర్ 18(ప్రజాజ్యోతి) 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మద నరసన్న ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ మంజూరు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆకుల నరసన్న పటేల్ మాట్లాడుతూ.. తెలంగాణాలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. పదేళ్లుగా పింఛన్ కోసం ఎదురుచూస్తున్న అర్హులకు ప్రస్తుతం పింఛన్ మంజూరు కావడం ఎంతో సంతోషకరమని, లబ్ధిదారుల ఆనందం ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనమని అన్నారు.అర్హులైన పేదలకు పింఛన్లు మంజూరు చేసి వారి జీవితాల్లో భరోసా కల్పిస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి ఆకుల నర్మద నరసన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావులకు ధన్యవాదాలు తెలిపారు.వారి ఆదేశాలు,సహకారంతో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ సమతం, 11వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చుక్కల ప్రశాంత్, పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రాకెట్‌బాల్ పోటీలకు కోరా జాన్సన్ విద్యార్థుల ఎంపిక



కరీంనగర్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)జాతీయ స్థాయి రాకెట్‌బాల్ క్రీడా పోటీలకు కోరా జాన్సన్ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. తమిళనాడులో నిర్వహించనున్న ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలతో పాటు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.క్రీడలతో పాటు విద్యలోనూ రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల ఎంపిక పట్ల కోరా జాన్సన్ విద్యాసంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్న డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్



ఎల్లారెడ్డిపేట, నవంబర్ 18 (ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రతిష్ఠాపన కార్యక్రమాలు బుధవారం చివరి రోజున సిద్ధోగం వేడుకలతో ఘనంగా ముగిశాయి.ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ రేణుకా ఎల్లమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఆయన వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు మూషికం దత్తాద్రి గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు గిరిధర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్,ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుడిది రాజేందర్,నాయకులు మర్రి శ్రీనివాస్ రెడ్డి, బుచ్చాగౌడ్, కిషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా సామూహిక కార్తీక దీపోత్సవం



వేములవాడ,నవంబర్,18 :ప్రజాజ్యోతి. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాస ఉత్సవాలు అత్యంతవైభవంగా కొనసాగుతున్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా, బుధవారం 8వ రోజు వేడుకలను ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.నవంబర్ 10వ తేదీ నుండి డిసెంబర్ 8వ తేదీ వరకు కొనసాగనున్న ఈ పవిత్ర కార్తీక మాస పర్వదినాల సందర్భంగా, ప్రతిరోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు మరియు శ్రీ రాజరాజేశ్వరి సేవాసమితి సభ్యులకు ఆలయ అర్చకులు, అధికారులు పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు, వాయనంతో పాటు శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గౌతమ్, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు మరియు అర్చకులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఉప సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వరా?

- ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం అందించాలి
- ఎంపీడీవోకు ఉప సర్పంచ్‌ల ఫిర్యాదు



ఇల్లందకుంట, నవంబర్ 18 (ప్రజా జ్యోతి):ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న చేయూత ఆసరా నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి గ్రామ ఉప సర్పంచ్‌లకు ముందస్తు సమాచారం అందించకపోవడంపై ఉప సర్పంచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇల్లందకుంట మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)కు ఫిర్యాదు చేశారు.ఉప సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీ, అభివృద్ధి కార్యక్రమాలు గురించి గ్రామ ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం అందించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. అయితే చేయూత ఆసరా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయాన్ని తమకు తెలియజేయకపోవడం బాధాకరమన్నారు.ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులమైన తమకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలకు అందుబాటులో ఉండి తమ బాధ్యతలు నిర్వర్తించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.ఈ విషయంపై సంబంధిత అధికారులను విచారించి, ఉప సర్పంచ్‌లకు సమాచారం ఎందుకు అందించలేదో వివరణ ఇవ్వాలని ఎంపీడీవోను కోరారు. భవిష్యత్తులో మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు మరియు ఇతర ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం అందించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాప్రతినిధుల గౌరవానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ కార్యక్రమాల్లో వారికి తగిన గుర్తింపు కల్పించాలని కోరారు.

రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుంది

- రైతులు దళారుల బారిన పడి మోసపో వద్దు
- ప్రభుత్వ కల్లాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర తో పాటు బోనస్ పొందాలి
- మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్



మంథని, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటూ, కుటుంబ సభ్యుల్లా కడుపున పెట్టుకొని చూసుకుంటుందని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. ఐటీ, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి., మంథని ఆధ్వర్యంలో విలోచవరం కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మంథని మున్సిపల్ పరిధిలోని శ్రీరాం నగర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ వోద్నాల శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ లు ప్రారంభించగా, మండలంలోని మైదుపల్లి, గుమ్నూర్, తోట గోపయ్య పల్లి, లక్కెపూర్, మహా భూబ్ పల్లి, నగరం పల్లి, పుట్టపాక, పోతారం, మల్లేపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచులు పంతంగి లక్ష్మన్, చెరుకుతోట సురేష్, దొబ్బల రమేష్, ఇసంపల్లి లక్ష్మి– శ్రీనివాస్, న్యాతరి లత–శ్రీనివాస్, కన్నూరి రాజబాబు, ఎడ్ల ఆదిత్య, లక్కాకుల సత్యనారాయణ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు దళారుల బారిన పడి మోసపోవద్దని, వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధాన్యం ధరలను తగ్గించే ప్రయత్నం చేస్తే రైతులకు అండగా నిలిచి ఆదుకోవడానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు.ఐటీ,పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఎక్కడ ఉన్నా ప్రతిరోజూ సుమారు 18 గంటల పాటు పని చేస్తూ, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఏయే అభివృద్ధి పనులు చేపట్టాలనే విషయంపై నిరంతరం ఆలోచిస్తూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజలు ఎన్నుకోబడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం మేలు చేసే ప్రభుత్వమని అన్నారు. వై ఎస్ రాజ శేఖర్ రెడ్డి హాయంలో శ్రీధర్ బాబు పౌర సరఫరాల శాఖా మంత్రిగా ఉన్నపుడు వరి ధాన్యం కొనుగోలు వ్యవస్తను సహకార సంఘాల్లో అమలు చేసి గ్రామా గ్రామాన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని అన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామాల్లో కొనుగోలు వ్యవస్త కొనసాగుతుందని అన్నారు. ప్రపంచ దేశాలు హైదరాబాద్ వైపు చూస్తున్నాయంటే మంత్రి శ్రీధర్ బాబు వల్లేనని. శ్రీధర్ బాబు అనేక ప్రాంతాల్లో ఐటీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను ముఖ్యమంత్రి హోదాలో చూడాలని ప్రజల ఆకాంక్షను అయన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ వోద్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏ–గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,441 చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర తో పాటు రూ 500 బోనస్ పొందాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవినీతికి తావివ్వకుండా కొనుగోళ్ళు చేపడుతామని అన్నారు. రైతుల చివరి వరి ధాన్యం గింజ వరకు తమ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమాల్లో సంఘ డైరెక్టర్లు సిరిముర్తి ఓదెలు, కొత్త శ్రీనివాస్,దాసరి లక్ష్మి–మొండయ్య,దేవల్ల విజయ్ కుమార్, సంఘ కార్యదర్శి బొద్దుల సమ్మయ్య, ఏఈఓ జి.హారిక, మున్సిపల్ కౌన్సిలర్ ఎల్లంకి వంశీధర్, పెంటరి రాజు, మాజీ ఎంపిపి కొండ శంకర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎక్కేటి అనంత రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమాదేవి–సురేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కొమ్మిడి స్వరూప్, నాయకులు జాగిరి సదానందం, తొగరి ఓదెలు, వేల్పుల రాజు, ఎడ్ల శ్రావణ్, సవాయి గణేష్, శీలం ప్రభాకర్, మేదరవేన పర్వతాల్ యాదవ్, కేతం లక్ష్మి– రమేష్, అప్పని రాజు, పెట్టేం రామస్వామి, పొనగంటి రమేష్, బొందుగుల అంజయ్య, తొగరి సురేష్, నౌండ్ల సదానందం, కన్నూరి స్నేహ– సంతోష్, బూడిద రాజయ్య, తూండ్ల లక్ష్మి, ఎడ్ల ప్రమీల, కోరవేని రవి, రాగం శ్రీనివాస్, కాసిపేట ప్రశాంత్, రాయమల్లు, తాళ్ళపల్లి సత్యనారాయణ, ముస్కుల రాజిరెడ్డి, పెండ్రి తిరుపతి రెడ్డి, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, హమాలి సంఘం నాయకులు, రైతు సంఘం నాయకులు, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

దత్తత విద్యార్థినికి అరువేల నగదు ప్రోత్సాహం



తిమ్మాపూర్ నవంబర్ 18 (ప్రజాజ్యోతి):–కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మన్నెంపల్లి పూర్వ విద్యార్థిని గంద్రాజ్ శ్రీవల్లి స్వగ్రామం పోరండ్ల 2026 మార్చి నెలలో జరిగిన పరీక్షల్లో 10వ తరగతిలో 545 మార్కులతో పాఠశాల ప్రథమ శ్రేణిలో నిలిచింది.మరియు తిమ్మాపూర్ మండల స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. తల్లి దండ్రులు నిరుపేదలు కావడంతో ఈవిద్యార్థినికి బహుజన ఏకలవ్య ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు మల్లవరపు సుబ్బులు భర్త కీశే మల్లవరపు దాసు వర్ధంతి సందర్భంగా ఫౌండేషన్ నిధి నుండి ఆరు వేలు చెక్కును మన్నెంపల్లి గ్రామ సర్పంచ్ గౌరవ శ్రీమతి పొన్నం సునీత అనిల్ గౌడ్ అలాగే ప్రధానోపాధ్యాయులు చకినాల రాంమోహన్ చేతుల మీదుగా అందజేయడమైనది.ఇట్టి కార్యక్రమంలో బహుజన ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మానుపాటి రాజయ్య ఉపసర్పంచ్ బూడిద కిషోర్,మాజీ సర్పంచ్ మేడి అంజయ్య, బిఆర్ఎస్ నాయకులు పొన్నం అనిల్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు పోతుగంటి శ్రీనివాస్, తాళ్ళపెల్లి కిరణ్,బిజేపి నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి,కొయ్యడ శ్రీనివాస్,రావుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు నేతల పరామర్శ





జమ్మికుంట నవంబర్ 18 (ప్రజాజ్యోతి)హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో కలిసి జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పలు పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జమ్మికుంట పట్టణ పరిధిలోని కొత్తపల్లి మాజీ సర్పంచ్ బొద్దుల రవీందర్ మాతృమూర్తి బొద్దుల పుల్లమ్మ ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఐదో వార్డుకు చెందిన ఉపాధ్యాయుడు యాట్ల అశోక్ అకాల మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు పోల్నేని అజయ్, యాట్ల సునీత, అశోక్, వేణుగోపాల్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్వర్ణోత్సవ మహాసభలకు తరలిరండి

- పెద్దపల్లిలో స్వర్ణోత్సవ వేడుకలు.. బొల్లి నందయ్య పిలుపు

ధర్మారం, నవంబర్ 18 (ప్రజా జ్యోతి):ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 22న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం ధర్మారం మండల శాఖ అధ్యక్షుడు బొల్లి నందయ్య పిలుపునిచ్చారు.బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద సంఘం నాయకులతో కలిసి స్వర్ణోత్సవ వేడుకలకు సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ.. అంబేద్కర్ యువజన సంఘం ఐదు దశాబ్దాల ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ మహాసభలకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి దళిత, బహుజనులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు కాంపల్లి చంద్రశేఖర్,బొల్లి స్వామి, కాడే సూర్యనారాయణ, చొప్పదండి మల్లేశం, కాంపల్లి రాజేశం, సుంచు మల్లేశం,తుమ్మల రాంబాబు,బొమ్మగాని సతీష్,దేవి రాజలింగు, పెరుక బానేష్,దూడతిరుపతి,మద్దునాల రాజమల్లు,దూడ సురేష్, శాతరాజుల సుమన్,మద్దునాల మల్లేశం, కొత్తూరి సతీష్, కాశిపాక శ్రీనివాస్, బొల్లి రాజేశం, బచ్చలి నర్సింగం, దీకొండ రాజు, బొల్లి రాజం,కాంపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- గోదావరి పుష్కరాల నేపథ్యంలో ట్రాఫిక్ నిర్వహణకు ముందస్తు చర్యలు చేపట్టాలి
- మంథని పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా





మంథని, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): మంథని పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, మంథని ఎస్ఐ సందీప్ కుమార్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ గౌరవ వందనం స్వీకరించారు.

తనిఖీలో భాగంగా పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కేంద్రం, సిబ్బంది కిట్స్,లాకప్,బ్యారక్‌లను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, అన్ని రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.రిసెప్షన్ కేంద్రం సిబ్బందితో మాట్లాడిన కమిషనర్ రికార్డులను పరిశీలించడంతో పాటు,కేసుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, సంబంధిత రికార్డులను అప్‌లోడ్ చేయడం వంటి ప్రక్రియలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి వ్యక్తిగత, శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 40 సంవత్సరాలు పైబడిన సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి ఆరు నెలలకు ఒక సారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మంథని పోలీస్ స్టేషన్ అత్యంత కీలకమైన పోలీస్ స్టేషన్ అని తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. కేసుల దర్యాప్తులో ఎలాంటి జాప్యం లేకుండా చట్టపరమైన విధానాలను పాటిస్తూ, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంథని పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు.రహదారి నిర్మాణపనులు,పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ముందస్తు ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. పుష్కరాల సమయంలో భక్తులు,ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రూట్ మ్యాప్,పార్కింగ్,వాహనాల మళ్లింపు, రద్దీ నియంత్రణ వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణ అభివృద్ధితో పాటు అసాంఘిక కార్యకలాపాలు పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు నిఘాను మరింత పటిష్టం చేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ముఖ్యంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై నిరంతరం నిఘా ఉంచాలని, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులు, వాటి సరఫరా మార్గాలపై సమాచారం సేకరించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.మంథని పట్టణంతో పాటు పరిసర కాలనీలు, గ్రామాల్లో నిరంతరం యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు, యువతకు వివరించి, ప్రజల భాగస్వామ్యం తో డ్రగ్స్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టులు,బ్యాంకింగ్ మోసాలు తదితర సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని, అనుమానాస్పద లింకులు, సందేశాలు, ఫోన్ కాల్స్‌కు స్పందించకుండా జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో అదనపు బలగాలు, ప్రత్యేక బృందాల సహకారం అందిస్తామని పోలీస్ కమిషనర్ తెలిపారు. నేరాల నియంత్రణకు సంబంధించి స్థానిక పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట పికెట్లు, పెట్రోలింగ్,వాహనతనిఖీలు,అనుమానితులపై నిఘా వంటి చర్యలను పటిష్టంగా చేపట్టాలని సూచించారు. ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన పోలీస్ సేవలు అందించేందుకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కమిషనర్ సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, చట్టపరమైన పరిధిలో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు,ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు

- మిల్లర్లకు సూచించిన మార్కెట్ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం



జమ్మికుంట, నవంబర్ 18 (ప్రజాజ్యోతి) జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా కొనసాగించేందుకు మార్కెట్ చైర్‌పర్సన్ కార్యాలయంలో స్థానిక మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్కెట్ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం, మార్కెట్ కార్యదర్శి మల్లేశంతో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత బోయిని బాబుకు ఘన సన్మానం

- నవాబుపేటలో అంబరాన్నంటిన సంబరాలు.. భారీ ర్యాలీ
- అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు





చిగురుమామిడి, నవంబర్ 18 (ప్రజా జ్యోతి): బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల న్యూఢిల్లీలో ప్రతిష్ఠాత్మక "అంబేద్కర్ నేషనల్ అవార్డు" అందుకున్న యువ నాయకుడు బోయిని బాబును సిద్దిపేట ఏసీపీ (సీసీఎస్) గడ్డం సదన్ కుమార్ తదితరులు అభినందించి, ఘనంగా సన్మానించారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు దళిత సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. అంబేద్కర్ భావజాల వ్యాప్తి కోసం బోయిని బాబు గత దశాబ్ద కాలంగా అలుపెరగని కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో అంబేద్కర్ అవార్డు ప్రదానం చేయడం తమ ప్రాంతానికే గర్వకారణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాణా ప్రతాప్ సింగ్, గొట్టి రఘుబాబు, వివిధ పార్టీల నాయకులు ఠాకూర్ నరేందర్ సింగ్, బోయిని ఆది మల్లయ్య, బోయిని సతీష్, బోయిని విజయ్ కుమార్, బోయిని మనోజ్, బోయిని వంశీకృష్ణ, బోయిని సురేష్, శంకర్, ఉమేష్, రఘు, పందిపెల్లి మహేష్, సంపత్, రాజయ్య, లింగయ్య, ఎన గందుల సంజీవ్ అంజనేయులు, నితిన్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించిన కార్మిక సంఘ నాయకులు



తిమ్మాపూర్ నవంబర్ 18 (ప్రజాజ్యోతి) :- కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామానికి చెందిన కన్నం లక్ష్మణ్ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆపద సమయంలో మానవత్వంతో స్పందించి బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బవన నిర్మాణ కార్మిక సంగం అధ్యక్షులు కన్నం నర్సయ్య,ఉపాధ్యాయులు నాయిని రమేష్, ప్రధాన కార్యదర్శి, అడిచర్ల లక్ష్మణ్, సలహాదారులు అడిచర్ల వెంకటేష్,కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ధర్మారం, నవంబర్ 18(ప్రజా జ్యోతి న్యూస్): ధర్మారం మండలం కొత్తూరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ భూక్య సంగీత ఆంజనేయులుతో కలిసి సెర్ప్ ఏపీఎం నర్సమ్మ ప్రారంభించారు ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు.అనంతరం సెర్ప్ ఏపీఎం నర్సమ్మ మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చే ముందు నిబంధనల ప్రకారం ఆరబెట్టి, శుభ్రపరిచి తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం విక్రయిస్తే రైతులకు మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ధర్మారం మండల అధ్యక్షుడు లావుడ్య రూప్లా నాయక్, ఉప సర్పంచ్ సామల నాగభూషణం, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీ గణపతి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న దేశిని కోటి



హుజూరాబాద్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి)హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో నిర్వహించిన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠమహోత్సవ కార్యక్రమానికి శ్రీ శ్రీ శ్రీ డాక్టర్ విద్యాప్రసన్న తీర్థ స్వామీజీ విచ్చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యమఠం, కుక్కే సుబ్రహ్మణ్యపీఠాధిపతి జగద్గురు స్వామీజీని జమ్మికుంట పట్టణ సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ గణపతి ఆలయ కమిటీ అధ్యక్షులు దొంత రమేష్, కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు జిల్లెల్ల తిరుపతిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సాయిని రవి, చందరాజు, బొంగోని వీరన్న, రామ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాకేష్, కిషోర్ పాల్గొన్నారు.

రుణం ఇప్పిస్తానని రూ.12.21 లక్షల టోకరా

- రూ.1.50 కోట్ల లోన్ పేరుతో మోసం
- నకిలీ మంజూరు పత్రాలు సృష్టించిన నిందితుడి అరెస్ట్



కరీంనగర్ క్రైం, నవంబర్ 18, (ప్రజాజ్యోతి):రుణాలు ఇప్పిస్తానంటూ ఆన్‌లైన్‌లో ప్రచారం చేసుకుంటూ,బ్యాంకు నుంచి రుణం మంజూరైనట్లు నకిలీ పత్రాలు సృష్టించి ఓ కుటుంబాన్ని మోసం చేసిన వ్యక్తిని కరీంనగర్ రూరల్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు.రూ.1.50కోట్ల రుణం ఇప్పిస్తానని నమ్మించి బాధితుల నుంచి రూ.12.21 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.కరీంనగర్ రూరల్ సీఐ ఏ.నిరంజన్‌రెడ్డి కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన వొడ్నాల జగన్ కుమార్తె వైష్ణవి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు.ఇతరుల ద్వారా ఆమెకు పరిచయమైన వేల్పుల సాయికృష్ణ రుణం ఇప్పిస్తానంటూ నమ్మబలికాడు.కరీంనగర్‌లోని ఆరెపల్లి గ్రామ సర్వే నంబరు 232/ఆలో ఉన్న 383.02 గజాల ఇంటి స్థలంపై రూ.1.50కోట్ల రుణం ఇప్పిస్తానని చెప్పాడు.టాటా క్యాపిటల్ ఫైనాన్స్ ద్వారా రుణం మంజూరవుతుందని నమ్మించాడు.ఈ ప్రక్రియలో భాగంగా ఇన్సూరెన్స్ ఖర్చుల నిమిత్తం తొలుత రూ.8.99 లక్షలు చెల్లించాలని కోరడంతో వైష్ణవి నిందితుడి బ్యాంకు ఖాతాకు ఆ మొత్తాన్ని బదిలీ చేశారు.అనంతరం రుణం,పత్రాల ప్రాసెసింగ్ పేరుతో మరో రూ.3.22 లక్షలు వసూలు చేశాడు. ఆ తర్వాత రుణం మంజూరైనట్లు నకిలీ పత్రాలను జగన్‌కు అందజేశాడు.అనుమానం వచ్చిన బాధితుడు ఆ పత్రాలను తీసుకుని సంబంధిత ఫైనాన్స్ సంస్థను సంప్రదించగా అవి తమ సంస్థకు చెందినవి కావని, అందులోని సంతకాలు కూడా తమ అధికారులవి కాదని సిబ్బంది స్పష్టం చేశారు.దీంతో మోసపోయినట్లు గుర్తించిన జగన్ కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు వేల్పుల సాయికృష్ణను గుర్తించి అరెస్టు చేశారు.మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన అతడు ప్రస్తుతం కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు.నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.అతడి వద్ద నుంచి నకిలీ రుణ మంజూరు పత్రాలు,బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి వెల్లడించారు.

డిసెంబర్ 11 వ తేదీ నుంచి ఖేలో ఇండియా పోటీలు

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- 8వ ఎడిషన్ ఖేలో ఇండియా నేషనల్ యూత్ గేమ్స్ - 2026 లోగో, మస్కట్ గోడ పత్రికలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్







ఏ రాందాస్ తదితరులు పాల్గొన్నారు

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి నవంబర్ – 18 (ప్రజాజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 8వ ఎడిషన్ ఖేలో ఇండియా నేషనల్ యూత్ గేమ్స్ – 2026 లోగో, మస్కట్ గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఆవిష్కరించారు. సెల్ఫీ పాయింట్ వద్ద జిల్లా కలెక్టర్ ఫోటో దిగారు.డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్ తో పాటు వరంగల్, నిజామాబాదు, ఖమ్మం,మహబూబ్ నగర్,కరీంనగర్ పట్టణాలలో జాతీయ యువజన క్రీడలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.రాష్ట్రం లో నిర్వహిస్తున్న జాతీయ క్రీడలకు జిల్లాలోని యువత, క్రీడాకారులకు అవగాహన కల్పించడానికి, విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. క్రీడలకు సంబందించిన లోగో, మస్కట్ లను జిల్లాలోని క్రీడా ప్రాంగణాలు,బస్సు స్టాండ్స్ వద్ద ప్రధాన కూడళ్ళలో కటౌట్లు, బ్యానర్లు, పోస్టర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో రామ్ రెడ్డి , డీటీసీ పీఓ అన్సార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సీపీఓ సంపత్ కుమార్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి

రైస్ మిల్లర్లతో అదనపు కలెక్టర్ సమావేశం

రాజన్నసిరిసిల్లప్రతినిధినవంబర్18(ప్రజాజ్యోతి)జిల్లాలోనిరా అండ్ బాయిల్ రైస్ మిల్లర్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సమావేశమయ్యారు.యాసంగి 2024–25 సీజన్ కు సంబంధించిన బకాయిలు ఉన్నమిల్లర్లు ఈ నెల 30వ తేదీ వరకు సీఎంఆర్ ఇవ్వాలని సూచించారు. అలాగే ఖరీఫ్ 2026–27 సీజన్ కు సంబంధించిన ధాన్యాన్ని డిఫాల్ట్ లేని రైస్ మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీ ఇస్తే వారికి ధాన్యం కేటాయిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తనూజ తదితరులు ఉన్నారు.

ప్రతి అర్హ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మిడిదొడ్డి భాను కుమార్



ముస్తాబాద్: నవంబర్ 18(ప్రజా జ్యోతి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రతి అర్హ కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మిడిదొడ్డి భాను కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ నెల 19వ తేదీ నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజలు ముందుగానే అవసరమైన వివరాలు, పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రతి రేషన్ కార్డు కలిగిన కుటుంబంలో కుటుంబ పెద్దగా ఉన్న వ్యక్తి లేదా కుటుంబం తరఫున బీమా కోసం ఎంపిక చేసుకున్న వ్యక్తి వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.దరఖాస్తు ప్రక్రియలో భాగంగా రేషన్ కార్డు, ఆధార్ కార్డు, నామినీ వివరాలు తదితర అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకుని సంబంధిత గ్రామపంచాయతీ కార్యాలయంలో లేదా ప్రభుత్వం సూచించిన కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.కుటుంబంలో సంపాదించే వ్యక్తికి అనుకోని ప్రమాదం జరిగినా, మరణం సంభవించినా ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా భరోసా కల్పించేందుకు ఈ పథకం దోహదపడుతుందని భాను కుమార్ పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజనకరమని అన్నారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో ఈ పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు.ప్రతి అర్హ కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, అవసరమైన పత్రాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం కూడా ప్రభుత్వ పథకం ప్రయోజనాన్ని కోల్పోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మిడిదొడ్డి భాను కుమార్ విజ్ఞప్తి చేశారు.

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో ఢిల్లీ

- డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో రాంలీలా మైదానంలో భారీ ధర్నా
- కార్మికులంతా లక్షలాదిగా తరలిరావాలి – సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు గీస భిక్షపతి

ముస్తాబాద్, నవంబర్ 18:(ప్రజా జ్యోతి):కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న భారీ ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ, సీడబ్ల్యూఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గీస భిక్షపతి పిలుపునిచ్చారు. బుధవారం రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గీస భిక్షపతి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 1996లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డును యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్మికుల హక్కులను కాలరాసే విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్మికుడికి నెలకు కనీస వేతనం రూ.42 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులు, హమాలీ కార్మికులతో పాటు ఇతర రంగాల్లో పనిచేస్తున్న 55 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి నెలకు రూ.9 వేల పెన్షన్ అందించాలని కోరారు. అదేవిధంగా ఇళ్లు లేని నిరుపేద భవన నిర్మాణ కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని, కార్మికుల పిల్లలకు డిగ్రీ వరకు ఉచిత విద్య, ఫీజు రీయింబర్స్ మెంట్ తో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో ఢిల్లీలో జరిగే ధర్నాకు కార్మికులు, కర్షకులు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ హమాలీ సంఘం అధ్యక్షుడు కట్కూరి నరేష్, పిట్ట ప్రవీణ్, జంగం లింగం, చిలకల రాజేందర్, దీటి నరసయ్య తదితరులు పాల్గొన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

